"స్వామీ! నాకు ఈ ప్రపంచం మొత్తం బాగుచెయ్యాలని వుంది. దానికి మంచి దారి ఏది?"

"అది చాలా తేలికయిన పని. ఈ ప్రపంచం మొత్తం బాగవాలి అంటే ముందుగా నీ దేశం మొత్తం బాగవ్వాలి. నీ దేశం మొత్తం బాగవ్వాలి అంటే ముందుగా నీ వూరు మొత్తం బాగవ్వాలి. నీ వూరు మొత్తం బాగవ్వాలి అంటే ముందుగా నీ కుటుంబం మొత్తం బాగవ్వాలి. నీ కుటుంబం మొత్తం బాగవ్వాలి అంటే ముందుగా నువ్వు మొత్తం బాగవ్వాలి." నవ్వుతూ జవాబు చెప్పాడు సమర్థ రామదాసు.

## 68. తత్త్వ బోధ

ఓ ఉత్తమ సన్న్యాసిని తనింటికి భిక్షకి పిలిచాడో గృహస్థు. ఆ రోజు టి.విలో ఇండియా-పాకిస్థాన్‌ల మధ్య జరిగే క్రికెట్ ఆటని ప్రసారం చేస్తున్నారు. ఇండియా ఆటగాళ్ళు బాగా ఆడినప్పుడు ఇంటిల్లి పాది ఆనందంగా చప్పట్లు కొడుతూ, పాకిస్థాన్ వాళ్ళు బాగా ఆడినప్పుడు నిస్పృహ చెందసాగారు. కాని ఆ సన్న్యాసి మాత్రం పాకిస్థాన్ వాళ్ళు బాగా ఆడినా కూడా ఆనందంగా చప్పట్లు కొట్టసాగాడు.

"ఇదేమిటి స్వామి? మీరు ఇండియన్, పైగా హిందువు అయివుండి కూడా, పరాయి మతస్థుల ఆటని మెచ్చుకుంటున్నారేమిటి?" గృహస్థు ఆశ్చర్యంగా అడిగాడు.

"నేను ఆటగాళ్ళల్లోని నైపుణ్యాన్ని మెచ్చుకుంటున్నాను తప్ప ఆటగాళ్ళని కాదు. అలాగే ప్రపంచంలోని మనుషుల చర్యలన్నిటినీ దైవలీలగా భావించి మెచ్చుకోవాలి తప్ప వాళ్ళ మీద రాగద్వేషాలని ఏర్పరుచుకోకూడదు. ఇందువల్ల కర్మబంధంలో చిక్కుకోం. మీ ఇంట్లో భిక్షచేసినందుకు గాను నేను బోధించే తత్త్వ బోధ ఇది." చెప్పాడా సన్న్యాసి.